# హామీలన్నీ అమలు చేశాం.. ఆశీర్వదించండి

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి




పుట్టపర్తిలో ఓ మహిళ సమస్యను పరిష్కరించాలని సూచిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ధర్మవరం: వీధి బాలలను సీఐకి అప్పగిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

**పుట్టపర్తి:** సత్యసాయి బాబా నడయాడిన ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి కీర్తి, ప్రతిష్టలను మరింతగా ఇనుమడింప చేస్తామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పుట్టపర్తి పెద్ద బజార్ సచివాలయ పరిధిలోని 3, 6వ వార్డుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. పలువురు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. మున్సిపాలిటీ పరిధిలో బ్రాహ్మణపల్లి వద్ద పేదలకు సుమారు 3 వేల ఇళ్ల పట్టాలిచ్చి ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం పెద్ద ఎత్తున జరుగుతోందన్నారు. గడిచిన నాలుగేళ్లలో సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని వెల్లడించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 95 శాతానికి పైగా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. తమ ప్రభుత్వంలో ప్రతి కుటుంబం ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు సాయిలీల, సూర్యగౌడ్, చెరువు భాస్కర్‌రెడ్డి, సాయిగీత, అనిత, పార్టీ ఇన్‌చార్జ్ రమేష్, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, మహిళా నాయకురాలు కవిత, పార్టీ పరిశీలకులు శివశంకర్‌రెడ్డి, తిప్పారెడ్డి, సుధాకర్ రెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

**వీధి బాలలను పాఠశాలల్లో చేర్పించాలి**

**ధర్మవరం:** పట్టణంలో ఎక్కడా కూడా వీధిబాలలు, బాల కార్మికులు కనిపించకూడదు. వారంతా పాఠశాలల్లో చదువుకోవాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని 26వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కూల్‌కు వెళ్లకుండా పేపర్లు, గుజిరీ సామాన్లు ఏరుకుంటూ ఉన్న ఇద్దరు పిల్లలను చూసిన ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. వారి తల్లిదండ్రులను పిలిపించారు. పిల్లలను పాఠశాలలకు పంపించేలా చూడాలని వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యంకు సూచించారు. పట్టణంలో ఉన్న బాల కార్మికులు, వీధి బాలలను గుర్తించాలని ఆదేశించారు. వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం వీధి బాలలను స్టేషన్‌కు తీసుకెళ్లి వారికి కొత్త బట్టలు కొనిచ్చారు. అనంతరం వారి తల్లిదండ్రులను పిలిపించారు. వచ్చే విద్యా సంవత్సరంలో పిల్లలను బడికి పంపించాలని కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే వార్డులో కోట్లు విలువ చేసే పార్కు అధ్వానంగా ఉండటంతో పార్కును అభివృద్ధి చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు ఆదేశించారు. వెంటనే పార్కును అభివృద్ధి చేయిస్తామని కమిషనర్ తెలిపారు. రహదారులు, కాలువలు నిర్మించాలని ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రాయపాటి మంజుల, వార్డు ఇన్‌చార్జ్ రాయపాటి రామకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ పెనుజూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

**ఓడీ చెరువు:** మండలంలోని చింతమానుపల్లి పంచాయతీ పరిధిలోని అచ్చామియాపల్లి, కాటమరెడ్డిపల్లి, నాయనవారిపల్లి, కమ్మవారిపల్లి, బొమ్మిరెడ్డి చెరువు, మల్లిమల్లోల్లపల్లి, మల్లెలవాండ్లపల్లి గ్రామాల్లో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ రాజునాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్టారెడ్డి, సర్పంచ్ జగన్‌మోహన్‌చౌదరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటా సంక్షేమ పథకాలపై వివరిస్తారన్నారు.

**నడింపల్లి, చిప్పలమడుగులో 1వ తేదీన..**

**కదిరి అర్బన్:** మండల పరిధిలోని కాళసముద్రం సచివాలయం పరిధిలోని నడింపల్లి, చిప్పలమడుగు గ్రామాల్లో మే 1వ తేదీన ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధామణి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాలన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**రామగిరి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతున్నట్లు ఎంపీడీఓ ఆజాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

## క్లుప్తంగా

### పాఠశాల తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**ఓడీ చెరువు:** మండలంలోని కమ్మవారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం ఎంపీడీఓ పోలప్ప, ఈఓఆర్డీ రాజశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు రికార్డులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. తరగతి గదులను పర్యవేక్షించారు. విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా అందిస్తున్న మధ్యాహ్న భోజనం రుచి చూశారు. మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుదాకర్‌నాయక్, ఉపాధ్యాయులు గౌస్‌లాజమ్, రామక్రిష్ణ, రమణ పాల్గొన్నారు.

### 'డ్రైడే-ఫ్రైడే'పై అవగాహన



యర్రగుంట పల్లిలో భవన నిర్మాణ కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

**నల్లచెరువు:** తలమర్లవాండ్లపల్లి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం వైద్యాధికారులు డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఉపాధి కూలీలు, భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సూర్యనారాయణ రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ హరిత, ఏఎన్ఎం భాగ్యమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



చిన్నారుల వివరాల నమోదును పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ సూర్యనారాయణ

**తనకల్లు:** మండల పరిధిలోని తవళం, గేమేనాయక్ తండా సచివాలయాలను డీఎల్‌డీఓ సూర్యనారాయణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. గ్రామ సచివాలయాల ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని సూచించారు. పేదల సంక్షేమ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో చేపట్టిన ఐదేళ్లలోపు చిన్నారుల వివరాల నమోదుపై వలంటీర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పూల నరసింహులు, కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

### మొక్కజొన్న రైతులు పేర్లు నమోదు చేసుకోండి

**అమడగూరు:** రబీలో పండించిన మొక్కజొన్నకు మద్దతు ధర కోసం ఆర్బీకేల్లో పేర్లను నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి జ్యోత్స్న శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. క్వింటాల్‌కు రూ.1,962 మద్దతు ధర ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ-క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ మద్దతు ధర కల్పిస్తుందన్నారు. రైతులు వెంటనే ఆర్బీకేల్లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అలాగే కొత్తగా పాస్ పుస్తకాలను పొందిన రైతులు ఈనెల 30వ తేదీలోపు రైతు భరోసా పథకానికి ఆర్బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### అభివృద్ధి పనులపై చర్చ



మద్దులచెర్వు పాఠశాలలో మాట్లాడుతున్న హెచ్‌ఎం నాగిరెడ్డి

**తాడిమర్రి:** తాడిమర్రి, మద్దులచెర్వు, దాడితోట, నాయనపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. సామాజిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో జరిగిన నాడు-నేడు అభివృద్ధి పనులు, గదుల నిర్మాణం, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద (మధ్యాహ్న భోజనం) తదితర పనులపై చర్చించారు. అభివృద్ధి పనులపై విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. యూనిట్ టెస్టులు, ప్రోగ్రెస్ కార్డులపై సంతృప్తి వ్యక్తం చేశారు. తాడిమర్రి, నాయనపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాలకు ఎంఈఓ కృష్ణమోహన్ హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగిరెడ్డి, అంజనేయులు, ఉపాధ్యాయురాలు గంగాభవాని, సీఆర్‌పీ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలి



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

**తలుపుల:** మండలంలోని కొవ్వూరివాండ్లపల్లి-చెరువుమరవపల్లికి మధ్యలో ఉన్న బ్రిడ్జి గత ఏడాది వర్షాలకు దెబ్బతింది. గతంలో ఎమ్మెల్యే సిద్దారెడ్డి గ్రామాన్ని సందర్శించినప్పుడు బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. హామీ మేరకు చేపట్టిన పనులను శుక్రవారం పరిశీలించారు. నాణ్యతలో రాజీ లేకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే పది, పదిహేను గ్రామాలకు ఇబ్బందులు తొలగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రఫీనాయక్, మాజీ సర్పంచ్ పయాజ్ అహమ్మద్, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకే బాబు, నాయకులు దేవేంద్రనాయక్, నరసారెడ్డి, ప్రభు పాల్గొన్నారు.

## భాస్కర్‌రెడ్డి మరిన్ని పదవులు చేపట్టాలి



డీసీఈబీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**నల్లమాడ:** శ్రీసత్యసాయి జిల్లా సాధారణ పరీక్షల విభాగం (డీసీఈబీ) కార్యదర్శిగా ఎంపికైన మండలంలోని యర్రవంకపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమగుట్ట భాస్కర్‌రెడ్డిని శుక్రవారం ఉపాధ్యాయులు సన్మానించారు. ఆర్‌డీటీ ఏరియా కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమానికి నల్లమాడ, కదిరి ఎంఈఓలు వేమనారాయణ, చెన్నకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. డీసీఈబీ ప్రథమ కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డి ఎంపిక కావడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు భాస్కర్‌రెడ్డిని దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, హెచ్‌ఎంలు ఓబుళరెడ్డి, రమణప్ప, బషీరుద్దీన్, శ్రీనివాసులు, సతీష్, కేజీబీవీ ఎస్ఓ శోభారాణి, ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్‌మాస్టర్లు రాంజీనాయక్, నరసింహులు పాల్గొన్నారు.

## పోలింగ్ బూత్ లెవల్ కన్వీనర్ల నియామకం



రంగారెడ్డి లక్ష్మీనారాయణ నరసింహారెడ్డి

**పుట్టపర్తి:** ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాలతో నియోజకవర్గంలోని 6 మండలాలకు పోలింగ్ బూత్ లెవల్ కన్వీనర్ల నియామకం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. అందులో భాగంగా శుక్రవారం అమడగూరు మండల పోలింగ్ బూత్ లెవల్ కన్వీనర్, కో-కన్వీనర్ల నియామకం పూర్తి చేశారు. మండల పోలింగ్ బూత్ లెవల్ కన్వీనర్‌గా తుమ్మల రంగారెడ్డి, కో-కన్వీనర్లుగా కె.లక్ష్మీనారాయణ, జేసీబీ నరసింహారెడ్డిని నియమించారు. తమ నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి పోలిగ్ బూత్ లెవల్ కన్వీనర్లు కృతజ్ఞతలు తెలిపారు.

## చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ మన్సూరుద్దీన్

**ధర్మవరం రూరల్:** మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చట్టాలను అమలు చేస్తోందని, ఆపద సమయాలలో వాటిని సద్వినియోగం చేసుకోవాలని ధర్మవరం రూరల్ సీఐ మన్సూరుద్దీన్ విద్యార్థినులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని సంజీవపురం కేజీబీవీ పాఠశాలలో ఎస్ఓ బెళుగుప్ప నాగరత్నమ్మబాయి అధ్యక్షతన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మహిళల రక్షణకు ప్రతి సచివాలయం పరిధిలో ఒక మహిళా పోలీసును నియమించిందన్నారు. మహిళల సమస్యలను తెలుసుకుని.. వాటిని అధికారుల సాయంతో పరిష్కారం అయ్యేలా చూస్తున్నారన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో వరకట్న వేధింపులు, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, కుటుంబ తగాదాలు, తదితర వాటిపై అవగాహన కల్పించారు.

## జోరుగా 'జగనన్నే మా భవిష్యత్'



గాండ్లపెంట: వేపరాలలో కరపత్రాలు అందజేస్తున్న డాక్టర్ బత్తల హరిప్రసాద్



ధర్మవరం రూరల్: పథకాలను వివరిస్తున్న రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ సూర్యప్రకాష్ బాబు



నల్లమాడ: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో స్టిక్కర్లు అతికిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**నల్లమాడ:** మండలంలోని రెడ్డిపల్లిలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం నిర్వహించారు. ఆటో స్టాండ్‌లో ఆటోలకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు షరీఫ్, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

**తలుపుల:** మండలంలోని ఈదులకుంట్లపల్లిలో శుక్రవారం ఎంపీపీ రఫీనాయక్, జేసీఎస్ కన్వీనర్ టోపీ రమణ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జోరుగా సాగింది. కార్యక్రమంలో దేవేంద్రనాయక్, మాజీ సర్పంచ్ పయాజ్ అహమ్మద్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

**ధర్మవరం రూరల్:** బత్తలపల్లి మండల కేంద్రంలో శుక్రవారం రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్య ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వివరించారు.

**నల్లచెరువు:** తవళంమర్రి పంచాయతీలోని కడపలవాండ్లపల్లిలో సింగల్ విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, ఆధ్వర్యంలో నాయకులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహసారథులు, వలంటీర్లతో కలసి ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ సుధాకర్, వలంటీర్లు ఆంజనేయులు, వాణి, గృహసారథులు ఆదినారాయణరెడ్డి, మోహన్, నాయకులు: రామచంద్ర, సుబ్బయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

**గాండ్లపెంట:** మండల పరిధిలోని వేపరాలలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇళ్ల యాజమానుల అనుమతితో డోర్లకు స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో కదిరి రూరల్ వైస్ ఎంపీపీ ఆదినారాయణ, కదిరి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బహావుద్దీన్, లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగాల లోకేశ్వరరెడ్డి, నాయకులు గోవర్ధన్, రాఘవేంద్ర, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. మండల పరిధిలోని వేపరాలలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ ఆలయ కమిటీ సభ్యులకు శుక్రవారం రూ.25 వేలు విరాళంగా అందించారు.

**చెన్నేకొత్తపల్లి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమైందని జెడ్పీటీసీ మైలారపు గోవిందరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని వెంకటంపల్లి గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుల, మతం, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలకు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



అమర్‌నాథ్‌రెడ్డికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, తదితరులు

**ధర్మవరం:** వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి 2016లో తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కాళ్లు, ఎడమ చేయికి గాయాలు కావడంతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయాన్ని ఇటీవల నార్పలకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి అమర్‌నాథ్‌రెడ్డి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో తక్షణ సాయంగా సీఎంఆర్ఎఫ్ కింద రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి శుక్రవారం అందజేశారు. ముఖ్యమంత్రి జగన్, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి అమర్‌నాథ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ యోగేశ్వరిదేవి తదితరులు పాల్గొన్నారు.

## 'వైఎస్సార్ జలకళ'పై సోషల్ ఆడిట్



వంచిరెడ్డిపల్లి వద్ద బోరు లోతును పరిశీలిస్తున్న అధికారులు

**ఓడీ చెరువు:** మండలంలోని సున్నంపల్లి, నల్లగుట్లపల్లి, తంగేడుకుంట పంచాయతీల పరిధిలో శుక్రవారం 'వైఎస్సార్ జలకళ' పథకం ద్వారా వేయించుకున్న బోర్లపై సోషల్ ఆడిట్ జరిగింది. బోర్లు వేయించుకున్న రైతుల పొలాల్లో బోరు లోతు, నీటి లభ్యత వంటి అంశాలను ఏపీడీ శ్రీనివాసరెడ్డి, సోషల్ ఆడిట్ డీఆర్పీ మల్లికార్జునరెడ్డి, ఏపీడీ అసిస్టెంట్ ప్రతాప్‌రెడ్డి తదితరులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు పంచాయతీ పరిధిలో 30 మంది రైతులకు ఉచితంగా బోరు వేసినట్లు చెప్పారు. బోరు లోతు ఎంత? కేసింగ్ పైపు ఎంత వేశారు? నీరు ఎంత లోతులో ఉన్నాయి? సాగుభూమి అవునా? కాదా? విద్యుత్ సౌకర్యం ఉందా? ఎంత దూరంలో ఉంది తదితర అంశాలపై ఆడిట్ చేశారు. ఆడిటింగ్ పూర్తి కాగానే విద్యుత్ సమకూర్చుకున్న రైతులకు మోటార్లు అమర్చే కార్యక్రమం ఉంటుందని ఏపీడీ పేర్కొన్నారు.

**కనగానపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ జలకళ పథకం ద్వారా వేసిన బోరుబావులపై అధికారులు సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండలంలోని మామిళ్లపల్లి, ముక్తాపురం గ్రామాల్లో సామాజిక బృందం సభ్యులు పర్యటించారు. వ్యవసాయ పొలాల వద్దకు నేరుగా అధికారులు వెళ్లి బోరుబావులు పరిశీలించి, వాటి లోతు, నీటి పరిమాణాన్ని కొలచారు. దీనిపై టెక్నికల్ సూపర్‌వైజర్ జయరామిరెడ్డి మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో వైఎస్సార్ జలకళ ద్వారా 316 బోర్లు వేశారన్నారు. కనగానపల్లి మండలంలో 76 బోరుబావులు ఉన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు అబ్దుల్‌రెహ్మాన్, కిశోర్, ఫీల్డ్‌అసిస్టెంట్లు మహేష్‌రెడ్డి, చంటీ, పలువురు రైతులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ**

**తనకల్లు:** మండల పరిధిలోని సీఆర్ పల్లి, కొట్టువారిపల్లి, తురకవాండ్లపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం సర్పంచ్ కృష్టారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలని సూచించారు. కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఆటపాటలతో విద్యా బోధన చేయాలన్నారు.

**దుర్గమ్మ ఆలయంలో పూజలు**

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని దుర్గమ్మ ఆలయంలో శుక్రవారం హోమాలు, సంప్రోక్షణ పూజలు చేశారు. ఆలయ ఈఓ వెంకటేశులు, ఆలయ కమిటీ చైర్మన్ పర్వతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం దుర్గమ్మ దేవతను ప్రత్యేక పట్టు వస్త్రాలు, వివిధ ఆభరణాలతో అలంకరించి పూజలు చేశారు.

**విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం**

**తలుపుల:** మండలంలోని బండ్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఓబుళేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభమ్యాయి. తొలి రోజు మహాగణపతి పూజ, కలశస్థాపన, శుద్ధ పుణ్యాహవచనం, శనివారం ఉదయం నుంచి కలశారాధన, మహాగణపతి హోమం, నవగ్రహహోమం, జనాకర్షణ హోమం, సాయంత్రం స్వామి వారి మూలవిరాట్ విగ్రహానికి పంచగవ్య స్నానం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 30వ తేదీ ఉదయం స్వామి విగ్రహ ప్రతిష్ట , ధ్వజస్తంభ ప్రతిష్ట, కలశస్థాపన జరుగుతుంది. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

**సరస్వతీ అలంకారంలో వాసవీమాత**

**కదిరి టౌన్:** వాసవి జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం సరస్వతీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ అలంకారనికి ఉభయదారులుగా గోరంట్ల గోవిందరాజులు, బాలాజి, వంకాయల అశ్వత్ కుమార్, విజయప్రసాద్ కుటుంబీకులు వ్యవహరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మేడా వరప్రసాద్, కార్యదర్శి మాదాలం ఆనందబాబు, శంకరనారాయణ, సుబ్బారాజు పాల్గొన్నారు.

**ఘనంగా అక్కదేవతల ఉరుసు**



అక్కదేవతల అలంకరణలో ఏడుగురు బాలికలు

**ఓడీ చెరువు:** వెంకటాపురం పంచాయతీ పరిధిలోని పాలనేనివారిపల్లి సమీపంలోని గుట్టపై ఉన్న అక్కదేవతల ఆలయంలో శుక్రవారం బోనాల జాతర జరిగింది. అక్కదేవతలకు పసుపు, కుంకుమ, పూలు, గాజులు, చీరలు, నవధాన్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఏడు కలశాలు, ఏడు వెదరు చేటలు, ఏడు జాకెట్లు, ఏడు పచ్చలతో సప్తబంధన చేశారు. అక్కదేవతల ప్రతిమలకు ప్రతిరూపంగా ఏడుగురు బాలికలకు పసుపు, కుంకుమతో జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులునాయుడు, గంగినాయుడు, అప్పనాయుడు, పల్లపు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

**ఏకాగ్రత, రీప్రోగ్రామింగ్‌పై అవగాహన**

**పుట్టపర్తి:** వ్యక్తి తన మనసును అదుపులో ఉంచుకున్నప్పుడే తాను అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. శుక్రవారం బుక్కపట్నం జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో జరిగిన స్టెప్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఏకాగ్రత, రీ ప్రోగ్రామింగ్ ఆఫ్ మైండ్ అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతం సుబ్బారావును కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, రిటైర్డ్ ప్రిన్సిపాల్ మునయ్య, సిబ్బంది సన్మానించారు.

**చికిత్స పొందుతూ మహిళ మృతి**

**ముదిగుబ్బ:** మండల పరిధిలోని గుడ్డంపల్లి తండాకు చెందిన శాంతాబాయి (45) శుక్రవారం కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఈనెల 27న రాత్రి ముదిగుబ్బలోని ఆర్టీటీ కార్యాలయం నుంచి తన భర్త నారాయణస్వామి నాయక్‌తో కలిసి గుడ్డంపల్లికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శాంతాబాయి మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**ఘనంగా ప్రథమ వార్షికోత్సవం**

**కొత్తచెరువు:** కొత్తచెరువు గ్రామంలో వెలసిన పెద్దమ్మ తల్లి దేవాలయంలో శుక్రవారం అమ్మవారి ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి నూతన విగ్రహాన్ని ప్రతిష్టించి ఏడాది పూర్తి కావడంతో శుక్రవారం దేవాలయంలో పెద్దమ్మ తల్లికి వేదపండితుల ఆధ్వర్యంలో అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

## వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

**తాడిమర్రి:** ఉపాధిహామీ పనుల్లో కచ్చితమైన కొలతలు, నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి కూలీలకు సూచించారు. మండలంలోని పెద్దకోట్ల వద్ద జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం పరిశీలించారు. ముందుగా కూలీల మస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిట్టుబాటు కూలి లభించేలా పనులు చేయాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉదయం 6 పనులకు వచ్చి 10 గంటలోపు పనులు పూర్తి చేసుకుని వెళ్లాలన్నారు. మాజీ సర్పంచ్ పాటిల్ ప్రకాష్‌రెడ్డి, క్షేత్ర సహాయకులు సౌరెడ్డి పాల్గొన్నారు.